www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 27 ఆగస్టు 2024



28 నుంచి చెస్, క్యారమ్స్ టోర్నమెంట్

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎల్ఐసి సిబ్బందికి జోనల్ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్ కడపలో నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె. ఆర్.వి. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ జోనల్ టోర్నమెంట్‌కు మూడు రాష్ట్రాల పరిధిలోని 17 డివిజన్ల నుంచి మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 40 మంది క్యారమ్స్, 40 మంది చెస్ ఆడతారని తెలిపారు. 28 ఉదయం 10 గంటలకు మద్రాస్ రోడ్‌లోని హోటల్ శ్రీనివాస రెసిడెన్సి లో ఈ టోర్నమెంట్‌ను ఎల్ఐసి జోనల్ హెచ్ఆర్‌డి రీజనల్ మేనేజర్ కె.వి సత్యవాణి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థగా క్రీడలకు సముచిత రీతిలో ఎల్ఐసి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తాజా టోర్నమెంట్‌లో అంతర్జాతీయ ఎల్ఐసి క్రీడాకారిణి, హైదరాబాద్ డివిజన్ ఉద్యోగి అపూర్వ పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

నకిలీ పింఛన్లపై కొరడా!

- 3,513 పింఛనుదారులకు నోటీసులు
- 1,000 తప్పుడు సర్టిఫికెట్లుగా నిర్ధారణ
- నేడు కలెక్టర్‌కు నివేదిక అందజేత



ఉమ్మడి జిల్లాలో వికలాంగ పింఛన్లపై కత్తెరింపు పిడుగు పడనుంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట వికలాంగ పింఛన్లలో బోగస్ ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం 3,513 మంది వికలాంగ పింఛన్ దారుల, పలువురు అనుమానిత పింఛను దారులకు నోటీసులు జారీ చేసింది. ఇందులో 50 శాతం మందికిపైగా విచారణకు హాజరు కాలేదని తెలుస్తోంది. రీ అసెస్మెంట్ పరీక్షకు హాజరైన వారిలో సుమారు 1000 పైగా ఫేక్ సర్టిఫికెటుగా తేలినట్లు తెలుస్తోంది. త్వరలో వికలాంగ పెన్షన్ల నివేదికను కలెక్టర్‌కు అందించే అవకాశం ఉంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 2,66,385 మంది ఫింఛనుదారులు ఉన్నారు. ప్రతి నెలా రూ.120 కోట్ల మేర చెల్లింపులు చేస్తోంది. 39,839 మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. 3,436 పింఛన్‌దారుల సదరం సర్టిఫికెట్లను అనుమానించి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఒవపి పింఛనుదారుల అనంతరం వికలాంగ పింఛనుదారులే అధికంగా ఉండడం గమనార్హం. కడప జిల్లాలో 3,436 పెన్షన్లు బోగస్ అని భావించింది. నోటీసులు సైతం జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలో 2,23,436 మంది పెన్షనుదారులు ఉన్నారు. వీరికి సుమారు రూ.110 కోట్ల మేరకు చెల్లింపులు చేస్తోంది. వీరిలో 26,849 మంది వికలాంగ పింఛన్‌దారులు ఉన్నారు. 1040 మంది బెడెడ్ వికలాంగులు ఉండడం గమనార్హం. వెరసి ఉభయ జిల్లాలో 3,513 మంది వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టారు. కడప జిల్లాలో 60 శాతం మంది విచారణకు హాజరు గాకపోవడం గమనార్హం. మిగిలిన 40 శాతం పింఛనుదారులకు రీఅసెస్మెంట్ పరీక్షలు నిర్వహించగా 1,000 మందికిపైగా ఫేక్ సర్టిఫికెట్లుగా తేలింది. గుంటూరు, పశ్చిమగోదావరి వంటి ఇతర జిల్లాల నుంచి తెచ్చుకున్న సర్టిఫికెట్లు అధికంగా ఉన్నట్లు సమాచారం. పదేళ్ల కిందట సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుల జాబితాను సైతం రూపొందించింది. ఫేక్ సర్టిఫికెట్లు మంజూరు చేసిన వైద్యనిపుణుల్లో ఆందోళన నెలకొంది. సర్టిఫికెట్లపై సంతకాలు లేకుండా సీళ్లు వేసిన ఉదంతాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి సర్టిఫికెట్ల జారీలో సచివాలయ డిఇఒ దగ్గర నుంచి వైద్య నిపుణుల వరకు ఎవరెవరి పాత్ర ఎంత అనే కోణంలో విచారించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రీ అసెస్మెంట్ పరీక్షల్లో అత్యధికంగా ఆర్థో, చెవిటి, ఒకటి మెంటల్లీ రిటార్డు సర్టిఫికెట్లు ఉన్నట్లు సమాచారం. మెంటల్లీ రిటార్డు సర్టిఫికెట్ ఒరిజినల్‌గా తేలినట్లు సమాచారం. ప్రభుత్వం వికలాంగత్వం తీవ్రత ఆధారంగా రూ.ఆరు వేల నుంచి రూ.10 వేల మేరకు పెన్షన్ చెల్లింపులు చేస్తోంది. పెరాలసిస్ వంటి మంచానికి పరిమితమైన రోగులకు రూ.15 వేల వరకు చెల్లిస్తోంది. ఇటువంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టారు.

రహదారులు రక్తసిక్తం



కారులో ఇరుక్కున్న మృతదేహం

- వేర్వేరు సంఘటనల్లో ఎనిమిది మంది దుర్మరణం
- గువ్వల చెరువు ఘాట్‌రోడ్డులో ఐదుగురు.. దువ్వూరు వద్ద ముగ్గురు..
- ఆరుగురికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి
- కొండుగారిపల్లి వడ్డేపల్లిలో విషాద ఛాయలు



మృతులు వెంకటమ్మ, నాగలక్ష్మి, నాగయ్య, మహబూబ్ షరీఫ్ (ఫైల్‌ఫొటోలు)

కడప జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాలు రక్తసిక్తమయ్యాయి. భర్త మృతి చెందడంతో పెద్ద కర్మ అనంతరం జరిగే కార్యక్రమానికి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా నలుగురు దుర్మరణం చెందారు. వారితోపాటు కంటైనర్ డ్రైవర్ కూడా మత్యువాత పడ్డాడు. మరో సంఘటనలో తిరుమలకు వెళ్తూ ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ రెండు ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలు శోకసముద్రంలో మునిగాయి.

-చింతకొమ్మదిన్నె/చక్రాయపేట/రామాపురం/దువ్వూరు



నుజ్జునుజ్జు అయిన కారులో ఇరుక్కున్న మృతదేహాలు

కారును ఢీకొన్న కంటైనర్.. ఐదుగురు దుర్మరణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్‌లో 6వ మలుపు వద్ద సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారును కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులోని నలుగురు, కంటైనర్ డ్రైవర్ సహ ఐదుగురు మృతువ్యాత పడ్డారు. కారులోని నలుగురు తమ బంధువుల అంత్యక్రియలకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కారు నుజ్జునుజ్జు అయింది. కంటైనర్ లోయలో పడింది. కారులో ఉన్న మృతుల స్వస్థలం చక్రాయపేట మండలం వడ్డేపల్లి గ్రామస్తులుగా గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు..

చక్రాయపేట మండలం కుప్పం పంచాయతీ కొండుగారిపల్లె వడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న వెంకటమ్మ (50) భర్త ఇటీవల మృతిచెందాడు. అతని పెద్ద ఖర్మ కార్యక్రమ అనంతరం ఆమె తన తల్లి ఇంటికి గువ్వల చెరువుకు దీపం చూడడానికి తనకోడలు పల్లెపు నాగలక్ష్మి (35), కుమారుడు గుజ్జుగారినాగయ్య (46), చక్రాయపేట మండల ఉప్పలవారిపల్లె గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మహ్మద్ షరీఫ్ (38) కారులో బయలు దేరారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగు వస్తున్న కంటైనర్ కారును వేగంగా ఢీకొని లోయలోపడింది. ఈ సంఘటనలో కారులోని నలుగురితోపాటు, కంటైనర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. కారు నుజ్జున్జు అయింది. క్లీనర్ పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయనోపాటు ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వెంకటకుమార్, సికెదిన్నె సిఐ శంకర్‌నాయక్, రామాపురం సిఐ వెంకటకొండారెడ్డి, సిబ్బంది ఉన్నారు. పెద్ద కర్మ అనంతరం వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకోవడంతో కొండుగారిపల్లె వడ్డేపల్లి శోక సముద్రంలో మునిగింది.



ప్రమాదంలో మృతి చెందిన భగత్‌సింగ్, నాగలక్ష్మి, చిన్నారి కియాన్‌సింగ్

దువ్వూరు వద్ద కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురు..

దువ్వూరు మండల పరిధిలోని చింతకుంట వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పాప పుట్టిన వెంట్రుకలు తీయడానికి కోసం కర్నూలు నుంచి తిరుమలకు తుపాను వాహనంలో వెళ్తూ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. నలురుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనం సాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు.. కర్నూలుకు చెందిన వారు పాప పుట్టిన వెంట్రుకలు తీయడానికి కోసం సోమవారం తుపాను వాహనంలో తిరుమలకు బయలుదేరారు. దువ్వూరు మండలం చింతకుంట వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కియాన్‌సింగ్ (9నెలలు), భగత్‌సింగ్ (34), నాగలక్ష్మి (55) మృతిచెందారు. మరో నలుగురు యుగంధర్, ఉమామహేశ్వరి, సాయి, కల్యాణ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దువ్వూరు వద్ద బోల్తాపడిన ఘటనలో ధ్వంసమైన కారు

ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- చెత్త వాహనాలు కొనసాగిస్తున్నాం
- మేయర్ కె.సురేష్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

కొత్తగా కడప ఎమ్మెల్యే గెలిచిన మాధవి వాస్తవాలు తెలుసుకోకుండా తనపై, కార్పొరేటర్లపై నోరుపారేసుకోవడం సరికాదని మేయర్ సురేస్‌బాబు అన్నారు. సోమవారం కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బిచ్చగాడు పొద్దఎరుగనట్లు ఎంఎల్ఎ మాధవి నోటికి ఏదివస్తే అది మాట్లాడడం పద్ధతి కాదని హితవు పలికారు. చెత్తకు పన్ను కట్టవద్దని సిఎం చంద్రబాబు, టిడిపి నాయకులు ఎన్నికల్లో ప్రచారం చేశారని గుర్తు చేశారు. ప్రజల తీర్పును వైసిపి శిరసావహించిందని పేర్కొన్నారు. నగరంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చెత్తను క్లాప్ ద్వారా ఆటోలు పెట్టి సేకరిస్తున్నామని తెలిపారు. ప్రజలపై భారం పడకూడదని మురికివాడల్లో రూ.40, అర్బన్ ప్రాంతంలో రూ.80 వసూలు చేస్తూ వచ్చామని చెప్పారు. 73 ఆటోలు, అదనంగా 230 మంది కార్మికులతో చెత్తను ఏరోజుకారోజు సేకరిస్తూ వచ్చామన్నారు. కాంట్రాక్టర్‌కు 3 నెలలుగా చెల్లించాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో చాలామంది కార్మికులు పని చేయకుండా వెళ్లిపోయారని తెలిపారు. దీంతో చెత్త సేకరణ ఆటోలు దాదాపు 20 వరకు తిరగడం లేదని చెప్పారు. ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఏడాదికి రూ.76 కోట్లు కార్పొరేషన్‌కు ఖర్చు అవుతుంటే ఇందులో రూ.73 కోట్లు పారిశుధ్యానికి ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి నారాయణ జిల్లాలో కేవం 15 చెత్తవాహనాలు మాత్రమే తిరుగుతున్నాయని తెలిపారు. చిత్తూరులో అనంతపురం, ప్రొద్దటూరులో ఆటోలు తీసివేశారన్న విషయం ఎంఎల్ఎ మాధవి తెలుసుకోవాలని చెప్పారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సిగ్గుపడాలని పేర్కొన్నారు. 24 గంటలకు మంచినీరు ఇస్తామని భరోసా కల్పిస్తే నగరం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అమృత స్కీం ద్వారా నీటి సమస్యలను తీరుస్తామంటే పథకానికి కేటాయించాల్సిన నిధులను టిడిపి ప్రభుత్వం గతంలో, ప్రస్తుతం కేటాయించలేదని విమర్శించారు. వైసిపి 5 సంవత్సరాల పాలనలో 2 సంవత్సరాలు కరోనాకు పోతే కేవలం 3 సంవత్సరాలు మాత్రమే జగన్ సిఎంగా పరిపాలన చేశారని పేర్కొన్నారు. సిఎం జిల్లా వాసి కావడంతో అభివృద్ధి ఇంతమాత్రం చేశామని తెలిపారు. టిడిపి పాలనలో ఒక్కఅడుగు ముందుకు పడే అవకాశం లేదని చెప్పారు. జిల్లా అభివృద్ధి సిఎం చంద్రబాబు, టిడిపి నాయకులకు పట్టదన్నారు. రోడ్లమీద రిటైర్డ్ ఉద్యోగులు, కొంతమంది వాకర్లు కూర్చొని సేదతీరుతుంటే ఎంఎల్ఎ మాధవి రోడ్లమీద కూర్చొంటే వీపులు విమానం మోతా మోగిస్తామని మాట్లాడడం హేయమన్నారు. ఎంఎల్ఎగా ఉన్నవారు హుందా మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు చూసి కడప గురించి మాట్లాడాలన్నారు. సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు షఫీ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మదన్‌మోహన్ రెడ్డి

బోధనా పద్ధతులను ఉపయోగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

అడ్వాన్స్‌డ్ ప్రాక్టీసెస్ అండ్ పెడగోజి పద్ధతులను అధ్యాపకులు ఉపయోగించి విద్యార్థులకు బోధించాలని కెఎస్ఆర్ఎం వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఫ్యాకల్టీ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ మెథడ్స్ టీచింగ్, లెర్నింగ్ మెథడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ రవిశంకర్ పెడగోలజి, సస్టైనబుల్ డెవలప్‌మెంట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డెరైక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఎన్. ప్రసాద్, కన్వీనర్ అండ్ సిఆర్ఐ డీన్ డాక్టరు వెంకట నారాయణ, ట్రిపుల్ ఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్. ప్రియదర్శిని, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మారిప్రసాత్, డాక్టర్ కుమార్ రెడ్డి, ట్రిపుల్‌ఇ డిపార్ట్‌మెంట్, వివిధ కళాశాలల ఫ్యాకల్టీ, కెఎస్ఆర్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో అన్నదానం

ప్రజాశక్తి - కడప : వరద ఆది సేవా సమితి (నెహ్రూ నగర్ కడప) ఆధ్వర్యంలో సోమవారం అల్పాహారం, అన్నదానం చేశారు. సుమారు 380 మంది అన్నదానం చేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని సేవా సమితి అధ్యక్షులు వరద బ్రహ్మయ్య ఈ సందర్భంగా చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు శక్తి వంచన లేకుండా చేస్తానని బ్రహ్మయ్య తెలిపారు.



అన్నదానం చేస్తున్న సేవాసమితి అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ పురుషోత్తంరాజు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-చెన్నూరు

గ్రామంలో వెలసిన శ్రీ లలితాంబిక శ్రీ నాగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ధ్వజస్తంభ మహోత్సవం నిర్వహించనున్నారని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఆర్ పురుషోత్తం రాజు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు ఎదురుగా ఉన్న ఆలయంలో కార్యక్రమం జరుగుతున్నందున వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధ్వజస్తంభ ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తేవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు జి.ఎన్. భాస్కర్ రెడ్డి, శివారెడ్డి, కల్లూరు విజయ భాస్కర్ రెడ్డి, నీలం శ్రీనివాస్ రెడ్డి, గోవింద్ రెడ్డి, నజీర్ నజీర్, అశ్ర, అన్వర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేత నూకల జస్వంత్

ప్రజాశక్తి - కడప : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అశ్రఫ్, ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ గవర్నమెంట్‌లో విజేతగా నూకల జస్వంత్ నిలిచాడు. రెండవ స్థానంలో జతిన్ కుమార్, మూడవ స్థానంలో ప్రభుదేవా నిలిచారు. తరువాతి స్థానాలలో తాలిన్, స్పందన, ఉమాదేవి, నవీన్, దివ్యాన్సీ, దీపిక, తన్మైకాంత్ నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా నలుమూలల నుండి 50 మంది చర్చి క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారి, చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, కోచ్ తబసుం అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి

యుపిఎస్ ఆమోదయోగ్యం కాదు : యుటిఎఫ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాదన విజయకుమార్

ప్రజాశక్తి - బద్వేలు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) ఆమోదయోగ్యం కాదని, దానిని అంగీకరించే ప్రశ్నే లేదని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం బద్వేలులోని స్థానిక ఎన్‌జిఒహోమ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికే యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యో గులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్‌పిఎస్ పేరును యుపిఎస్‌గా మార్చిందని ఆరోపించారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని యుపిఎస్ పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ఇందులో ప్రస్తావి ంచకపోవడం దారుణమన్నారు. పైగా ఈ పథకం అమలు ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగి ఉందన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యాషన్ లేకుండా సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే తమకు ఆమోదయోగ్యమని ఆయన పేర్కొన్నారు. యుపిఎస్ అనేది కేవలం ఆంధ్రప్రదేశ్ అష్యూర్డ్ పెన్షన్ స్కీమ్ కాపీ అని, నూతన పెన్షన్ పథకం సంస్కరణకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలు అనేది దేశవ్యాప్తంగా ముఖ్యమైన రాజకీయ సమస్యగా మారిందని, గత లోక్‌సభ ఎన్నికలను సైతం ఇది ప్రభావితం చేసిందని ఆయన తెలిపారు. ఉద్యోగులలో వ్యతిరేకత, సమీప భవిష్యత్తులో రాజకీయ పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, కనీస ఉపశమనం అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడ, మోసపూరిత వ్యూహంగా ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్) విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆయన ఆరోపించారు. పాత పెన్షన్ పథకానికి ప్రత్యామ్నాయంగా ఏకీకృత పెన్షన్ పథకం అమలు ఆమోదయోగ్యం కాదని, పాత పెన్షన్ పథకాన్ని పూర్తిగా పునరుద్ధరిడమే ఏకైక పరిష్కారమని ఆయన తెలిపారు. పాత పెన్షన్ అమలు కోసం ఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలని ఈ సంద ర్భంగా ఆయన డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ట్రెజరర్ ఎ.గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి క్రిస్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.ఎం.డి.గౌస్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాల్సిన ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) పేరుతో కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకురావడాన్ని యుటియఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, తక్షణం దేశమంతటా పాత పెన్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పాళెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణ యాన్ని నిరసిస్తూ ఈనెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలి పారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు రవికు మార్, ట్రెజరర్ నరసింహారావు, ఆడిట్ కమిటీ కన్వీ నర్ ప్రభాకర్, నాయకులు గాజులపల్లి గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్,యడాల సురేష్ కుమార్, కరిముల్లా, కృష్ణారెడ్డి, కిరణ్ బాబు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత ఉత్సవాలకు తరలిరండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 29 నుంచి కడప వేలాంగణి ఆరోగ్యమాత తిరుణాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నవని, రాష్ట్ర నలుమూలల ఉన్న ప్రజలు కుటుంబ సభ్యులతో కలసి విజయవంతం చేయాలని కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గాలి బాలి ఆదేశాల మేరకు ఆరోగ్యమాత చర్చిలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను యువత బృంద సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువత అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, మాథ్యూ, మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. 29న పతాక ఆవిష్కరణకు కర్నూలు మేత్రాసన పీఠాధిపతులు రెవ డాక్టర్ బిషప్ గోరంట్ల జ్వనేస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారని తెలిపారు. సెప్టెంబర్ 7న మరియాపురం నుంచి నగర పురవీధుల గుండా, తల్లి తేరు ప్రదర్శనగా ఆరోగ్యమాత మందిరానికి చేరుకుంటుందని చెప్పారు. అనంతరం ఆరాధన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 8న కడప అపోస్తులిక పాలన అధికారి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గాలి బాలి చే సమిష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినీత్ రాజ్, విమల్, నవీన్ ప్రేమ్ చరణ్, సహాయ రాజ్ అమృత స్రవంతి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూత్ కమిటీ



మదర్ థెరిసా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

మదర్ థెరిసాకు ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

మానవసేవయే మాధవసేవగా భావించిన మహోన్నత మానవతా మూర్తి మదర్ థెరిసా అని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. భారతరత్న, నోబెల్ శాంతి విజేత మదర్ థెరిస్సా 114వ జయంతిని సోమవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 'ప్రార్థించే పెదాల కన్నా.. సేవ చేసే చేతులు మిన్న' అని మదర్ థెరిస్సా నిరూపించారని తెలిపారు. కుష్టు రోగులకు శాంతినగర్ కాలనీ, బిక్షగాళ్లకు, శిశు నిర్మల ప్రేమ నివాస, అనాథ శిశువులకు శిశు సదన్ నిర్మించి ఎందరికీ ఆదర్శమయ్యారని వివరించారు. ఆమె జీవితం నిరుపేదల సేవకు అంకితమన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఆమె మానవ సేవలోనే పునీతమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వినయ్, వేమా రాజా, మదార్, వేమయ్య, నాగ రాజు, మాష్, వెంకటేశు, రవి పాల్గొన్నారు.



పులివెందుల టౌన్ : దుప్పట్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మదర్‌థెరిస్సా తన జీవితాన్ని అనాథల సేవకు త్యాగం చేశారని సప్తగిరి హోటల్ యజమాని కంభం జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విభిన్నప్రతిభావంతుల కార్యాలయంలో మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జగదీశ్వర్‌రెడ్డి విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎంఎ డిస్ట్రిబ్యూటర్స్ యజమాని పద్మనాభయ్య, విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు చప్పిడి కృష్ణారెడ్డి, సంఘ కార్యవర్గ సభ్యులు శీలం సునీల్ కుమార్, బషీర్, ఖదీర్, అవినాష్ పాల్గొన్నారు.



విద్యుత్ స్మార్ట్ మీటరు అమర్చుతున్న అధికారులు

మండలంలో తొలి విద్యుత్ స్మార్ట్ మీటరు ఏర్పాటు

ప్రజాశక్తి - దువ్వూరు


తొలి స్మార్ట్ విద్యుత్ మీటర్‌ను మండలంలో మొదటిసారిగా రెవెన్యూ కార్యాలయంలో ఆ శాఖాధికారులు సోమవారం అమర్చారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఇఇ ఎం.భరణికృష్ణ మాట్లాడుతూ నియోజక వర్గంలో తొలి స్మార్ట్ విద్యుత్ మీటర్‌ను రెవెన్యూ కార్యాలయానికి అమర్చామన్నారు. డిజిటల్ మీటర్‌తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎడిఇ శ్రీనివాసులరెడ్డి, ఏఇ బి.వీరారెడ్డి, ఆదాని సంస్థ జెఇ ఎవి సురేంద్ర, విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య, లైన్‌మెన్ నాయబ్ రసూల్, ఎఎల్‌ఎం నరసింహులు, జెఎల్‌ఎం శివరాం, ఆదాని సంస్థ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున వేంపల్లెలోని పాపాఘ్ని నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ప్రతి రోజూ రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

12 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక నగిరిగుట్ట, కదిరి రోడ్డులో సోమవారం పేకాట స్థావరాలపై రెండు చోట్ల దాడులు చేసి 12మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.35,910 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు దాడులు చేశామన్నారు.

పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభమెప్పుడో..?

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలో పోలీస్ అవుట్ పోస్ట్ నిర్మాణం పూర్తయి నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. శ్రావణమాస ఉత్సవాలు ముగుస్తున్నప్పటికీ పోలీస్ అవుట్ పోస్టు ప్రారం భానికి నోసుకోలేదు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పూర్తయినప్పటికీ ప్రారంభం ఎప్పుడా అని భక్తులు ఎదురుచూస్తున్నారు. ఇంతవరకు ప్రారం భించక పోవడంలో ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు విలేకరుల దృష్టికి తెచ్చారు. పోలీస్ అవుట్ పోస్ట్ పూర్తయినప్పటికీ ఆరుబయటనే ఎండకు, గాలికి, వానకు షామియానా కిందనే పోలీసులను ఏర్పాటు చేయడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదనే విమర్శలున్నాయి. గండి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పోలీసు అవుట్ పోస్టును ప్రారంభించి గండి క్షేత్రానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

త్వరలోనే ప్రారంభిస్తాం : ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్‌కెవ్యాలీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.



పూర్తయి నెలలు గడుస్తున్నా గండిక్షేత్రంలో ప్రారంభానికి నోసుకొని పోలీస్ అవుట్ పోస్ట్

ఉక్కు పరిశ్రమను నిర్మించాలి : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ డిమాండ్ చేశారు. జమ్మలమడుగులో సోమవారం సిపిఎం పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి.మనోహర్ మాట్లాడుతూ విభజన చట్టంలో కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అందులో భాగంగా జమ్మలమడుగు ప్రాంతంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. చదువుకున్న యువతకు ఉపాధి లేక జిల్లాకు చెందిన వేలమంది ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రెండుసార్లు శంకుస్థాపన చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామంలో శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. జమ్మలమడుగు స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రస్తుత పాలకులు శంకుస్థాపనలకు పరిమితంగా కాకుండా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించాలన్నారు. ప్రజల ఆశలు నెరవేర్చాలని ఆయన కోరారు. సమావేశంలో జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, పట్టణ కమిటీ సభ్యులు విజయ్, వినయ్, నరేంద్ర, రాజు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులకు ప్రపంచాన్ని చూపిద్దాం



నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో అంధులకు ప్రపంచాన్ని చూపిద్దాం అని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు -2024 పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఎంతోమంది చూపు కోల్పోయి బాధపడుతున్నారని తెలిపారు. వారు నేత్రదానం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి వెలుగు ప్రసాదించాలంటే కేవలం నేత్ర దానంతో మాత్రమే సాధ్యమన్నారు. మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసి, అంధులకు చూపు ప్రసాదించాలని ఆయన సూచించారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు పోగొట్టేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షురాలు అనూష, ప్రధాన కార్యదర్శి హేమలత, శ్రీరాజా కళా నిలయం డాన్స్ మాస్టర్ రాజా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

వాడవాడలా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలో సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. మునిరెడ్డి కాంప్లెక్స్ కృష్ణ వేదిక నుంచి పాత బస్టాండ్ సర్కిల్, పూల మార్కెట్ మీదుగా అంబా భవాని దేవాలయం, నారాపుర స్వామి దేవాలయం మీదుగా సాగింది. ముఖ్య అతిథిగా ఎఎస్ఐ మురళి యాదవ్, సిఇఆర్డిఎస్ చైర్మన్ ఎల్.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జమ్మలమడుగు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పి.రంగ నాయకులు, నాగరాజు, సాయి, రమణ, నారాయణరెడ్డి, నరసింహ, సందీప్, వెంకటరెడ్డి, చలపతి, మల్లీశ్వరి, యాదవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : గ్రామోత్సవంలో శ్రీకృష్ణుడి విగ్రహం

వేంపల్లె : కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని వేంపల్లెలో కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. వడ్డే వీధిలో ఉన్న శ్రీకృష్ణున్ని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డేరంగుల రామాం జనేయులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టడంతో చిన్నారులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



మైదుకూరులో..

మైదుకూరు : కృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం మైదు కూరు పట్టణం, మండల పరిధిలో చిన్నారు లను తమ తల్లి దండ్రులు కృష్ణుని వేషధా రణలో అలంకరించారు. వేడుకలను ఘనంగా నిర్వహిం చుకున్నారు.



చిన్నారి దార్విశ్రీవర్మ

కడప : స్థానిక రాజారెడ్డి వీధిలోని షర్మిల ఇంగ్లీష్ మీడియం యుపి స్కూల్‌లో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణ గోపిక రాధిక వేషధారణలతో అందరినీ అల రించారు. తమ నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు తమ తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కరస్పాండెంట్ వి. ధీరజ్ ఇంత చక్కటి వేషధారణలతో వచ్చిన పిల్లల్ని వారిని అలంకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్నటువంటి చిన్నారి కృష్ణులకి, గోపికలకి బహు మతులు అందించి, అందరికీ శ్రీకృష్ణా జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

సింహాద్రిపురం : మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. సింహాద్రిపురం వేణుగోపాల స్వామి ఆలయంలో వేడుకలను వైభవం గా నిర్వహిం చారు. ఆలయ అర్చకులు రంగనాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు ఆల యానికి పెద్ద ఎత్తున చేరుకొని స్వామివారికి దర్శించుకున్నారు.

ఎర్రగుంట్ల : జువారి కర్మాగారంలోని డిఎవి స్కూల్‌లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రిన్సిపల్ వేణుగోపాల స్వామి నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వేసిన బాలకృష్ణుడు, గోపికలు, రాధ, రుక్మిణి, సత్య భామ, యశోద తదితర వేషధారణలు, నృత్యాలు, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి.

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు నరేంద్ర స్వామి, అర్చకులు చిన్న స్వామి, గోవింద స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భద్రకాళి వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



చాపాడులో..



కడప : షర్మిల ఇంగ్లీషు మీడియం పాఠశాలలో..



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి పోరాటం

- ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వారి సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్ రెడ్డి అవినాష్‌రెడ్డితో రాజకీయ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుట్టే రాము యాదవ్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఖాజీపేట

తెలుగు దేశం పార్టీ కార్యక్రమాలను టిడిపి యాప్ ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉత్తమ పని తీరు కనబరచినందుకు పాటిమీదిపల్లెకు చెందిన బిసి సెల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ మొదటి స్థానంలో నిలిచారు. ఆ మేరకు పార్టీ అధిష్టానం, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశంసిస్తూ లేఖను అందజేశారు. ఆ ప్రశంసాపత్రాన్ని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం రాముకు అందజేశారు. రెండవ స్థానం మైదుకూరు మండలం వనిపెంటకు చెందిన ఓబులేసు, మూడవ స్థానం మైదుకూరు మున్సిపాలిటీకి చెందిన బాలాజీ అందుకున్నారు.

టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులుగా రవికుమార్

ప్రజాశక్తి - వేంపల్లె



వైఎస్ఆర్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన ఎస్‌బి రవికుమార్, కార్యదర్శిగా ఎంఇఒ-2 స్టాలిన్‌ను ఎన్ను కున్నారు. టెన్నికాయిట్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ ఆదేశాల మేరకు కార్య వర్గాన్ని ఎన్నుకున్నట్లు టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. అన్నమయ్య జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మంజు ఆధ్వర్యంలో కార్యవర్గం ఏర్పాటు చేశారన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో టెన్నికాయిట్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రవికుమార్ తెలిపారు. పాఠశాల, కళా శాల స్థాయిలో టెన్నికాయిట్ క్రీడాభివృద్ధి చేసేందుకు విద్యార్థులకు శిక్షణ నిస్తు న్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిం చేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. తనను జిల్లా అధ్యక్షుడిగా చేసేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు, నాయకులు

ఇసుక వాహనాలు క్యూ లేకుండా చూడాలి

ప్రజాశక్తి - కొండాపురం

స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం వచ్చిన వాహనాలు క్యూ లేకుండా చూడాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని పి.అనంతపురం ఏటూరు ఇసుక రీచ్‌ను సోమవారం ఆర్‌డిఒ శ్రీనివాసులు, కూటమి మండల ఇన్‌ఛార్జి శివనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇసుక బుకింగ్ కోసం కొండాపురం, తాళ్ల ప్రొద్దుటూరు సచివాలయాలను సంప్రదించాలన్నారు. ఎప్పటికప్పుడు ఇసుక లోడ్ చేసి పంపించాలన్నారు. ఏ రోజు ఇసుక కావాలని ఆర్డర్స్ బుకింగ్ అవుతుందో ఆరోజు లోడ్స్ పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, గండ్లూరు శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, చామాల బాబురెడ్డి, రామానుజులరెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, అంకిరెడ్డి, బుజ్జి, తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ఎంపిడిఇ నాగప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రాజరాజేశ్వరి, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషి కేశవరెడ్డి పాల్గొన్నారు.

లైసెన్స్ లేకపోతే జరిమానా

- ఎస్ఐ తిరుపాల్ నాయక్

ప్రజాశక్తి - వేంపల్లె

వాహనాదారులు అందరూ తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, లేకుంటే జరిమానా విధిస్తామని ఎస్ఐ తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. పిల్లలుకు వాహనాలను ఇవ్వరాదని, ఇస్తే ఆ తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.